క్లుప్తంగా

గిన్నిస్ రికార్డు కోసం.. గిరిజన పిల్లలకు కష్టాలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర ప్రభుత్వం గొప్పల కోసం, ప్రధాని మెప్పు కోసం, మరీ ముఖ్యంగా గిన్నిస్ రికార్డు కోసం వేల మంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేశారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మండిపడ్డారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుంచి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్స్ నుంచి యోగాంధ్ర కార్యక్రమానికి అర్ధరాత్రి 2 గంటలకు బస్సులో తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, అజయ్, వెంకీ, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

ఐఎంఏలో యోగా డే

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని శనివారం గుంటూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఐఎంఏ హాలులో యోగ ఆసనాలు వేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ మహేష్, నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బరాయుడు, కార్యదర్శి డాక్టర్ బాలినేని సాయికృష్ణ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ రాధికా రాణి, తదితరులు పాల్గొని మాట్లాడారు.

ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలి

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో పలువురు బీజేపీ నేతలు యోగ ఆసనాలు వేశారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, జూపూడి రంగరాజు మాట్లాడారు.

మొక్కలు నాటిన అధికారులు



నెహ్రూనగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్వామా పీడీ వి.శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాద్, గుంటూరు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్యామల, డ్వామా సిబ్బందితో కలిసి డ్వామా కార్యాలయం ముందు మొక్కలు నాటారు.

'పది' విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రత్తిపాడు: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ పత్తిపాడు మాజీ ప్రెసిడెంట్ పచ్చల శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన తమలపాకు శ్రీజ, షేక్ షాజియా, కొత్తపల్లి శ్రీలక్ష్మిలకు శనివారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పచ్చల సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పచ్చల శ్రీనివాసరావు విద్యార్థులకు నగదు బహుమతులను హెచ్ఎం చేతుల మీదుగా అందించారు. హెచ్ఎం సునీతలత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

పొన్నూరు: మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామంలో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరుణ భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటోంది. ఈక్రమంలో తన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే గ్రామంలో వరుస ఆత్మహత్యలతో కలకలం రేగింది. గ్రామానికి చెందిన చిన్న కోటయ్య శుక్రవారం ఉరేసుకుని చనిపోయిన సంఘటన మరువక ముందే మరో మహిళ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

గేదెలు మృతి

ప్రత్తిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రావూరు పరమేశ్వరరావు, గోరంట్ల రత్తయ్య, మందలపు సాయిబాబులు తమ గేదెలను మేత కోసం శుక్రవారం బయటకు వదిలారు. అయితే ఎప్పటిలా గేదెలు రాత్రి ఇంటికి రాలేదు. శనివారం ఉదయం గుంటూరు – పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై కోయవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు సమీపంలో మృతి చెంది పడి ఉన్నాయి. విషయం తెలుసుకున్న పశుపోషకులు ఘటనా స్థలానికి చేరుకుని గేదెలు తమవేనని నిర్ధారించుకున్నారు. అనంతరం విషయం వీఆర్వో రాణికి తెలియడంతో ఆమె గేదెల యజమానుల నుంచి వివరాలను సేకరించి, స్టేట్ మెంట్ తీసుకున్నారు. మృతి చెందిన గేదెల్లో రెండు పాలు ఇచ్చే గేదెలు కాగా, ఒకటి చూడి గేదె అని పోషకులు చెబుతున్నారు. రెండు మూడు రోజుల్లో గేదె ఈనను న్నదని ఈ లోపే ఇలా జరిగిందని వాపోతున్నారు. ఒక్కో గేదె విలువ రూ.లక్ష నుంచి లక్షన్నర వరకూ ఉంటుందని చెప్పారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలు వేస్తున్న ఏపీ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆకట్టుకున్న యోగాసనాల విగ్రహాలు

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ హరీష్

కొరిటిపాడు(గుంటూరు): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ హరీష్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ నిత్యం ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమించడానికి జీవితంలో యోగా అవసరమని తెలిపారు. యోగా నిపుణుడు ధరణిపతి శంకర్ యోగా సాధన ప్రాముఖ్యతను వివరించి, వివిధ యోగాసనాలు వేయించారు. వివిధ శాఖల నుంచి 150 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ జీఎంలు ఎస్.ఆర్. రఘునాథరెడ్డి, డి.వెంకటరమణ, జె.జమ్మీలాల్, కె.జనార్దన్‌రావు, జీవీ ప్రసాద్, ఎ.రాజశేఖరం, బ్యాంక్ ఏఎంఓ పర్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యోగాసనాల ప్రతిమలు ప్రారంభం

నగరంపాలెం: గుంటూరు నగరపాలక సంస్థ సహకారంతో జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) ఎదుట ఏపీ పోలీస్ చిహ్నం గుర్తు, యోగాసనాల ప్రతిమలను ఏర్పాటు చేశారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర -2025లో భాగంగా జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ భార్గవతేజ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఇన్‌చార్జి కమిషనర్ ఓబులేసు ప్రారంభించారు.

యోగా దినోత్సవం అట్టర్ ఫ్లాప్





మొక్కుబడిగా హాజరైన ప్రజలు, తాగునీటి కోసం విద్యార్థినుల అవస్థలు

- ఉదయం 6 గంటలకే రావాలని ఆదేశాలు
- 6.51 గంటలకు ప్రజాప్రతినిధుల జ్యోతి ప్రజ్వలన
- యోగాపై ఆసక్తి చూపని ఉద్యోగులు, నగరవాసులు
- వచ్చినా ఫోన్లు చూసుకుంటూ, ముచ్చట్లు చెప్పుకుంటూ కాలయాపన చేసిన వైనం

నెహ్రూనగర్: గుంటూరు పోలీస్ పరెడ్ గ్రౌండ్‌లో శనివారం యోగా దినోత్సవం నిర్వహించడంలో అధికారులు విఫలమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు, విద్యార్థులు, యోగా ట్రైనర్స్, ప్రజలు ఉదయం 6 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌కు రావాలని సూచించారు. అయితే అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం 6.51 గంటలకు వచ్చి జ్యోతి ప్రజ్వలన చేశారు. అయితే ఈ యోగా దినోత్సవానికి ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు ఆశించిన స్థాయిలో ఆసక్తి చూపలేదు. యోగా జరుగుతున్న సమయంలోనే ఫోన్లు చూసుకోవడం, ముచ్చట్లు చెప్పుకోవడం కనిపించింది.

టీ షర్టులు, క్యాప్‌ల కోసం పోటీ

సుమారు ఐదువేల మందికి వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేశారు. అయితే యోగలో పాల్గొన్న వారికి ప్రత్యేకంగా టీషర్ట్స్, క్యాప్‌లు తయారు చేయించారు. వాటిని కేవలం కొంత మందికి మాత్రమే పంపిణీ చేసి, మిగిలిన వారికి లేవని చెప్పడంతో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో టీ షర్టులు, క్యాప్‌ల కోసం ఎగబడ్డారు. అదేవిధంగా తాగునీటి కోసం కూడా పోటీ పడాల్సి వచ్చింది. ఓ పక్క ఎండతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు అధికారులు తాగునీటిని కూడా సక్రమంగా సరఫరా చేయకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

యోగా మ్యాట్ల మాయం..

పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో, ఇటు పోలీసు బందోబస్తు అంతంత మాత్రంగా ఉండటంతో బయట నుంచి చాలా మంది గ్రౌండ్ లోకి వచ్చి టీషర్టులు, క్యాప్‌లు తీసుకెళ్లారు. దీంతో పాటు, వీఐపీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యోగా మ్యాట్‌లను తీసుకెళ్లిపోయారు.

ఆర్డీ కార్యాలయ సూపరింటెండెంట్లుగా సత్యం, రామకృష్ణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు(ఆర్డీ) కార్యాలయం సూపరింటెండెంట్లుగా గుంటూరు మలేరియా ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న డి.సత్యం, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఎస్. రామకృష్ణ శనివారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా శుక్రవారం వీరు ఆర్డీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆర్డీ కార్యాలయంలో సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న షేక్ నాగూర్ షరీఫ్, గుంటూరు మెడికల్ కాలేజ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్ బాపట్ల డీఎంహెచ్ సూపరింటెండెంట్ ఆర్డీ కార్యాలయం నుంచి రిలీవ్ అయి విధుల్లో చేరారు. గుంటూరు మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న ఆండ్రూస్ మంగళగిరి టీబీ శానిటోరియంలో, మంగళగిరి టీబీ శానిటోరియంలో పనిచేస్తున్న రమణ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో, బాపట్ల డీఎంహెచ్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న రజాక్ గుంటూరు జిల్లా మలేరియా కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్లుగా విధుల్లో చేరారు.

యోగాతో నిర్ణయాత్మక శక్తి వృద్ధి



యోగాసన విన్యాసాలు ప్రదర్శించిన విద్యార్థినులతో భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: యోగాతో భావోద్వేగాలు నియంత్రణలో ఉంటాయని, తద్వారా నిర్ణయాత్మక శక్తి వృద్ధి చెందుతుందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగోత్సవ్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుగుతున్న క్రమంలో జీవితంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయన్నారు. వాటిని ఎదుర్కొనే క్రమంలో భావోద్వేగాలపై నియంత్రణ తప్పనిసరి అని, దీనికి యోగా ఉపకరిస్తుందని వివరించారు. ప్రతి రోజూ యోగా, వ్యాయామం చేయడం ద్వారా విద్యార్థులకు విషయ సంగ్రహణాత్మక శక్తి పెంపొందుతుందని, తద్వారా ఏకాగ్రతతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చన్నారు. గరల్స్ హాస్టల్ ప్రిన్సిపాల్, యోగా అధ్యాపకురాలు సుధారాణి, యోగా గురువులు రాజేశ్వరరావు, మల్లికార్జునరావు యోగా ఆవశ్యకత, స్వయంగా యోగాసనాలు వేసి విద్యార్థినులకు యోగా ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.

ఎన్ఐటీలో సీటు సాధించిన గురవయ్య కళాశాల విద్యార్థి



పాల్ రియాన్‌ను అభినందిస్తున్న ఎంవీఆర్కే ముత్యాలు, విజయలక్ష్మి, రూపచంద్రరావు

గుంటూరు ఎడ్యుకేషన్: మాజేటి గురవయ్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్న పాల్ రియాన్ ఎన్ఐటీలో సీటు సాధించడం కళాశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ మాజేటి వీఆర్కే ముత్యాలు పేర్కొన్నారు. శనివారం బ్రాడీపేటలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో కార్పొరేట్ కళాశాలలు పోటీపడే జేఈఈ మెయిన్‌లో ర్యాంకు సాధించి ఎన్ఐటీలో సీటు సాధించడం కష్టతరంగా ఉన్న పరిస్థితుల్లో దశాబ్దాల చరిత్ర కలిగిన మాజేటి గురవయ్య కళాశాలకు చెందిన సాధారణ విద్యార్థి సీటు సాధించడం తల్లిదండ్రులకు గర్వకారణమని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థి పాల్ రియాన్‌ను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గుడివాడ రూపచంద్రరావు, ఎంవీఆర్కే ముత్యాలు, ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొని అభినందించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

పొన్నూరు: నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్లో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సభకు ఎంఈఓ-2 కె. విజయభాస్కర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 చలపతిరావు, హెచ్ఎంలు శివలక్ష్మి, వైఎస్‌టీ సాయి, జయరాజు, అనూరాధ, మహబూబ్ బాషా, నిర్మల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అయితే పాఠశాలలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇంకా మండలంలో పూర్తిస్థాయిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేయక పోవడంపై తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాద బిందువులు రెండో భాగం గ్రంథావిష్కరణ



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం రెండో వీధిలోని శ్రీత్యాగరాజ కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నాద బిందువులు రెండో భాగం గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో జరగ్గా, నాట్య కళారత్న డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం సభాధ్యక్షత వహించారు. గ్రంథావిష్కరణకర్తగా కేంద్ర సంగీత నాటక అకాడమీ, సభ్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, గ్రంథకర్త, వేమూరి రామలక్ష్మి, శ్రీ త్యాగ రాజ సాంస్కృతిక సంఘం సలహాదారులు నేతి విశ్వేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కాజా సుబ్రహ్మణ్యం శిష్యురాలు షన్విక గణపతి కొతం రామ కోదండరామ కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. నాద బిందువులు రెండో భాగంలోని విశేషాలను వక్తలు వివరించారు. కార్యక్రమంలో భూసురపల్లి వెంకటేశ్వర్లు, నాట్యాచార్య బాలు, పెద్ది సాంబశివరావు, మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ సీట్ల కోసం ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని విద్యార్థులకు, 6, 7, 8, 9 తరగతుల సీట్ల కోసం దరఖాస్తు చేసిన వారికి ప్రవేశ పరీక్ష ద్వారా మరో అవకాశం కల్పించనున్నట్లు అడవి తక్కెళ్లపాడు అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ జి.ఆనందబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన బాలికలకు సత్తెనపల్లి రామకృష్ణాపురంలో, 23న తాడికొండ గురుకుల పాఠశాలలో 5వ తరగతికి ఎంట్రన్స్ రాసి సీటు రాని బాలురు కౌన్సెలింగ్‌కు హాజరైతే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న బాలురు, బాలికల గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లను పొందవచ్చని తెలిపారు. 6,7,8,9, తరగతుల ప్రవేశాలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 25వ తేదీన తాడికొండ అంబ్కేర్ గురుకులంలో 6,7 తరగతులకు ఉదయం 10 గంటలనుంచి, 8, 9 తరగతులకు, మధ్యాహ్నం రెండు గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు గతంలో ఎంట్రన్స్ రాసి సీటు రాని విద్యార్థులకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గుంటూరు అడవితక్కెళ్ళపాడు అంబేడ్కర్ గురుకులంలో ఈనెల 26వ తేదీన బాలికలకు, 27వ తేదీన బాలురకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని, ఇప్పటికే సీటు రాని విద్యార్థులు ఈ కౌన్సిలింగ్‌కు హాజరైతే ఖాళీగా ఉన్న సీట్లను పొందవచ్చన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రత్తిపాడు: మండల పరిధిలోని చినకోండ్రుపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. దాత గడ్డిపాటి పద్మజా రాణి సహకారంతో పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందించారు.

యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: ఈగల్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఐజీ ఆకె రవికృష్ణ ఆదేశాల మేరకు శనివారం నల్లపాడు పోలీసు స్టేషన్ లిమిట్స్‌లోని చౌడవరం గ్రామం వద్దనున్న బలరామకృష్ణ స్పిన్నింగ్ మిల్స్‌లో కార్మికులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఒడిశాకు చెందిన కార్మికులు సుమారు 300 మందికి డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈగల్ టీం విశిష్టత, మాదకద్రవ్యాల వినియోగం, వాటి దుష్పరిణామాల గురించి కార్మికులకు అవగాహన కల్పించారు. 1972 టోల్ ఫ్రీ నంబర్ యొక్క ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు. మాదకద్రవ్యాలు రవాణా చేసిన, అమ్మిన, కొనిన, తాగిన, కలిగి ఉన్నా చట్టపరమైన చర్యలు తప్పవని. మాదకద్రవ్య చట్టాలు మరింత కఠినతరం చేయటం జరిగిందని ఈగల్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ సింగయ్య, నల్లపాడు సీఐ వంశీధర్ హెచ్చరించారు. మిల్ యాజమాన్యం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి 'యువత పోరు'ను జయప్రదం చేయాలి



యువత పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పిలుపునిచ్చారు. ఆమె కార్యాలయంలో శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. యువతను చంద్రబాబు సర్కార్ మోసం చేసిందని మండి పడ్డారు. పెద్ద ఎత్తున యువత, విద్యార్థులు తరలి రావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.వినోద్, పార్టీ డివిజన్ల అధ్యక్షులు, పలువురు కార్పొరేటర్లు, యువజన, విద్యార్థి విభాగం నేతలు పాల్గొన్నారు.

- టీడీపీ నేతలు, వైఎస్సార్ సీపీ నేతల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని నూరిఫాతిమా విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా ఓ యువకుడు రఫా రఫా అనే పోస్టర్ పట్టుకుంటే, టీడీపీకి అంత భయం ఎందుకని ప్రశ్నించారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వై.ఎస్.జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదని చెప్పారు.

నిరుద్యోగ భృతి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

లక్ష్మీపురం: కూటమి ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్ వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఆయన మట్లాడుతూ నిరుద్యోగ యువతకు నెలకి రూ.3 వేలు చొప్పున భృతి చెల్లిస్తామని నారా చంద్రబాబు చెప్పిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి 26 జిల్లాల నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

భృతి తక్షణం ఇవ్వాలి

లక్ష్మీపురం: రాష్ట్రంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎన్నికల హామీ మేరకు తక్షణం ఇవ్వాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు ఇవ్వని కారణంగా 2024 జూన్ మాసం నుంచి ప్రతినెల మూడు వేల రూపాయలు ఇవ్వాలని కమ్యూనిస్టు ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా తులసి రామచంద్ర ప్రభు జన్మదిన వేడుకలు



తులసి రామచంద్ర ప్రభుకు మొక్కను బహూకరిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

కొరిటిపాడు(గుంటూరు): ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు, ఆయన తనయుడు తులసి కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు శనివారం పలువురు రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుమారులు తులసి యోగిష్, తులసి కృష్ణ చైతన్య, మనవడు తులసి ఆదిత్య సమక్షంలో బర్త్ డే కేక్‌ను రామచంద్ర ప్రభు కట్ చేశారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ఆత్మీయుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకంగా ఉందన్నారు. అరండల్‌పేటలోని తులసి సంస్థల కార్యాలయంలో సంస్థ ఉద్యోగులు, తులసి అభిమానుల సమక్షంలో తులసి రామచంద్ర ప్రభు, తులసి కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు శాసన సభ్యులు నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, జాగర్లమూడి శ్రీనివాసరావు, వ్యాపారవేత్త మలిశెట్టి సుబ్బారావు, సుప్రీమ్ సర్జికల్స్ జవహర్ పాల్గొన్నారు.


శ్రేష్ట హాస్పిటల్‌లో అరుదైన గుండె బైపాస్ సర్జరీ



డాక్టర్ నాగార్జున గొట్టిపాటి, డాక్టర్ హేమసుందర్

గుంటూరు మెడికల్: గుంటూరు శ్రేష్ట ఆస్పత్రిలో 75 ఏళ్ల వృద్ధుడికి గుండె బైపాస్ సర్జరీ చేసి నూతన జీవితాన్ని ప్రసాదించినట్లు శ్రేష్ట హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగార్జున గొట్టిపాటి చెప్పారు. శనివారం గుజ్జనగుండ్లలోని శ్రేష్ట హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ హేమసుందర్‌తో కలసి ఆపరేషన్ వివరాలు మీడియాకు వెల్లడించారు. గుండెలో మల్టిపుల్ బ్లాకేజీలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న 75 ఏళ్ల వృద్ధుడికి కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ వైద్యులు ఒకే సిట్టింగ్‌లో మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్(ఎంవీఆర్), కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ (సీఏబీజీ) చేయాలని నిర్ణయించామన్నారు. రోగి వయస్సు రీత్యా వాల్వ్ రీప్లేస్‌మెంట్ కోసం బయో ప్రొస్థెటిక్ వాల్వ్ చేశామన్నారు. ప్రత్యేక కార్డియాక్ ఎనస్థీషియా, ఇంటెన్సివ్ కేర్, రిహాబిలిటేషన్ టీమ్, నర్సింగ్ సిబ్బంది సహకారంతో ఆపరేషన్ విజయవంతంగా చేశామని వివరించారు. రోగి పూర్తిగా కోలుకున్నాడని, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తగ్గిపోయిందని డాక్టర్ నాగార్జున వెల్లడించారు. అత్యాధునిక గుండె ఆపరేషన్ సౌకర్యాలు తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ఈఫిల్ టవర్ వద్ద యోగా సాధన



ఈఫిల్ టవర్ వద్ద యోగా చేస్తున్న డాక్టర్ ఉమా శంకర్, డాక్టర్ రాజకుమారి తదితరులు

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరుకు చెందిన ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్టు, బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ శనక్కాయల రాజకుమారి కుటుంబ సభ్యులు ఫ్రాన్స్ దేశంలోని ప్యారీష్ ఈఫిల్ టవర్ వద్ద శనివారం యోగా సాధన చేశారు. ఈఫిల్ టవర్ చూసేందుకు వచ్చిన టూరిస్టులకు యోగా సాధన గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేస్తున్న యోగా సాధనకు గిన్నిస్ బుక్ రికార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ దేశాలకు యోగా సాధన ప్రాముఖ్యతను తెలియజేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతోందని చెప్పారు.

జనరల్ సర్జరీ విభాగాధిపతిగా డాక్టర్ కిరణ్‌కుమార్



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగాధిపతిగా డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ శనివారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ సర్జరీ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ జి.పద్మశ్రీ సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ రంగనాయక మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో సర్జరీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను విభాగాధిపతిగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.